క్లుప్తంగా

వ్యవసాయ శాఖలో ముగ్గురికి ఉద్యోగాలు



లక్ష్మీపురం: కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కారుణ్య నియామకంలో భాగంగా కొటికల సాల్మన్ రాజు, రుంజల రవిసాగర్, పద్మ సాయి నిఖిలకు ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజలను వ్యవసాయ శాఖలో జూనియర్ ఆఫీసు అసిస్టెంట్లుగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. నిబంధనల మేరకు డ్యూటీకి రిపోర్ట్ చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి , డీఆర్‌ఓ షేక్ ఖాజావలి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

తెనాలి పోలీసులను సస్పెండ్ చేయాలి

లక్ష్మీపురం: మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డ తెనాలి పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి డిమాండ్ చేశారు. కొత్తపేట జిల్లా సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. తెనాలి పట్టణంలో ముగ్గురు వ్యక్తులు చేసిన నేరం నిరూపణ అయిందో లేదో కానీ పోలీసులు చేసింది మాత్రం కచ్చితంగా నేరమేనని తెలిపారు. ఎవరైనా నేరం చేస్తే విచారణ చేపట్టి శిక్ష వేసే అధికారం న్యాయస్థానాలకు మాత్రమే ఉందని, పోలీసులకు ఎవరు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ఈ సంఘటనపై కోర్టు సుమోటోగా తీసుకుని ముగ్గురు యువకులను విచక్షణారహితంగా కొట్టిన ఘటన ప్రదేశంలో ఉన్న ప్రతి ఒక్కరిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం పోరాటం



లక్ష్మీపురం: ప్రభుత్వం వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకోవాలని చూడటం దుర్మార్గమైన చర్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ మండిపడ్డారు. సోమవారం సాయంత్రం మంగళగిరి మండలం చిన్నకాకానిలోని ఎన్నారై సమీపంలో గల భూములను జంగాల పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లు పాస్ చేసిన తర్వాత ఎన్నారై సమీపంలో గల 75 ఎకరాల వక్ఫ్ భూమిని చేజిక్కించుకోవాలని చూస్తోందని విమర్శించారు. వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం పోరాటం చేస్తామని తెలిపారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ తరతరాల నుంచి ఆ భూములు రైతులకు జీవనాధారంగా ఉన్నాయని, వాటిని ప్రభుత్వం ఎలా తీసుకుంటుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కౌలు రైతులు బొర్రా నాగేశ్వరరావు, రామినేని చంద్రమోహన్, సుంకర సుబ్బారావు, మర్రి మోహనరావు, సుంకర శంకరరావు, పాలడుగు రవికుమార్ పాల్గొన్నారు.

బదిలీ దరఖాస్తుల కోసం ఏర్పాట్లు



గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన దరఖాస్తులు సమర్పించేందుకు మంగళవారం గడువు ముగియనుండటంతో యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. రాజశేఖర్‌రావు, ఎం. కళాధర్ తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయ బదిలీల దరఖాస్తులను దాఖలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లాంగ్ స్టాండింగ్ విభాగంలో తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారితో పాటు సాధారణ బదిలీ కోరుకునే ఉపాధ్యాయులు మంగళవారం సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందుగా దరఖాస్తు దాఖలు చేయాలని, సమస్యలు ఉన్నట్లయితే అనంతరం గ్రీవెన్స్ ద్వారా పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఉపాధ్యాయులకు ఉచితంగా సేవలు అందించేందుకు యూటీఎఫ్ కార్యాలయంలో ఆన్‌లైన్ దరఖాస్తు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, కార్యదర్శులు జి. వెంకటేశ్వరరావు, బి. ప్రసాద్, ఎం. కోటిరెడ్డి, వి. వినోద, షేక్ గఫార్ పాల్గొన్నారు.

సైలెంట్ కిల్లర్స్ దాడి

- బీపీ, షుగర్‌ల బారిన యువత
- జిల్లాలో 1,67,734 మందికి అధిక రక్తపోటు నిర్ధారణ
- షుగర్ బాధితులు 1,48,313 మంది
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన





గుంటూరు మెడికల్ : జంట వ్యాధులుగా పిలువబడే బీపీ, షుగర్‌లు ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయి. సైలెంట్ కిల్లర్స్‌గా పిలవబడే ఈ రెండింటిలో ఒక జబ్బు ఒకసారి సోకితే జీవితాంతం దాన్ని నియంత్రణలో పెట్టుకునేందుకు ఆపసోపాలు పడాల్సిందే. జంట వ్యాధులు సోకాయంటే శరీరంలోని పలు అవయవాలు దెబ్బతిని జీవితం దుర్భరంగా మారుతుంది. ఆధునిక జీవన శైలి వల్ల ఈ వ్యాధులు నిర్ణీత వయస్సు కంటే ముందస్తుగానే ప్రజలపై దాడి చేస్తున్నాయి. వాతావరణం, ఆహారం, నీరు, ధ్వని, వాయు కాలుష్యంతోపాటుగా ఒత్తిడితో కూడిన జీవితాన్ని నేటి ప్రజలు గడుపుతున్నారు. దీంతో చిన్న వయస్సులోనే వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రజలు కూడా కొద్దిపాటి అవగాహన కలిగిఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ఎన్‌సీడీ 3.0 సర్వేతో వెలుగులోకి నిజాలు

జిల్లాలో నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) 3.0 కార్యక్రమాన్ని 2024 నవంబర్ 14 ప్రారంభించారు. ఇందులో జిల్లావ్యాప్తంగా 18 ఏళ్లు దాటిన వారికి వైద్య సిబ్బంది ఇళ్ల వద్దకే వెళ్లి బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. జిల్లాలో 18 ఏళ్లు దాటిన వారు 17,53,751 మంది ఉన్నారు. ఆరు నెలల కాలంలో 2025 మే 22 నాటికి 10,65,836 మందికి 60 శాతం స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. పరీక్షలు చేసిన వారిలో 1,67,734 మంది బీపీతో, 1,48,313 మంది షుగర్‌తో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఎక్కువ సంఖ్యలో షుగర్, బీపీ బాధితులు సర్వేలో నమోదు అవ్వడంతో జిల్లా వైద్యాధికారులు, వైద్య నిపుణులు సైతం ఆందోళన వ్యక్తం చేశారు. అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవడంతోపాటు, వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వ్యాధి బాధితులకు మెరుగైన వైద్య సేవల కోసం ఆరోగ్య కేంద్రాలకు రిఫర్ చేశారు.



బీపీ పరీక్షలు పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి (ఫైల్)

షుగర్‌తో కిడ్నీలు దెబ్బతింటాయి



బీపీ, షుగర్ ఉన్నవాళ్లు హైరిస్క్ గ్రూప్‌కు చెందిన వారు. వీరు కిడ్నీ జబ్బుల బారిన పడే అవకాశం చాలా ఎక్కువగా ఉంది. షుగర్ సోకిన ఏడు నుంచి పదేళ్లలో కిడ్నీలు పాడవుతాయి. అధిక బరువు ఉన్న వారు సైతం కిడ్నీ జబ్బున పడే ప్రమాదం ఉంది. జీవనశైలిలో వచ్చిన మార్పుల వల్ల నేడు 20 ఏళ్లు దాటిన ప్రతి 10 మందిలో ఒకరు కిడ్నీ జబ్బు బారిన పడుతున్నారు. బీపీ షుగర్ ఉన్నవాళ్లు తప్పనిసరిగా కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి. వయస్సు మీద పడేకొద్దీ సహజంగా మూత్ర సంబంధిత సమస్యలు వస్తాయి. వాటిని సకాలంలో గుర్తించకపోతే కిడ్నీలు పాడయ్యే ప్రమాదం ఉంది.

– డాక్టర్ చింతా రామకృష్ణ,
సీనియర్ నెఫ్రాలజిస్ట్, గుంటూరు

జాగ్రత్తలు తీసుకుంటే షుగర్ సోకదు



షుగర్ వ్యాధి ఉందా లేదా అని ముందస్తుగా తెలుసుకోవటానికి హెచ్‌బీఏ1సీ పరీక్ష చేయించుకోవాలి. ఉదయాన్నే పరగడుపున ఏమీ తినకుండా , తాగకుండా నిర్ధారణ పరీక్ష చేయించినప్పుడు రక్తంలో షుగర్ 100లోపు ఉంటే వ్యాధి లేనట్లే. 100 నుంచి 126లోపు ఉంటే ప్రీ డయాబెటిక్ దశలో ఉన్నట్లు లెక్క. అంటే ఇప్పుడే వ్యాధి శరీరంలోకి ప్రవేశించటానికి సిద్ధమవుతుంది. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే సోకదు. కుటుంబంలో ఒకరికి ఉంటే ఇతర కుటుంబ సభ్యులు ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవటం ద్వారా వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తపడొచ్చు.

– డాక్టర్ కోగంటి కల్యాణ్ చక్రవరి,
ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్ట్, గుంటూరు

అనూష మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

నెహ్రూనగర్: నగరంలోని గుంటూరువారితోటలో నివసించే రజక మహిళా అనూష అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ధోబీఘాట్ల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు చెన్నూరి చెన్నయ్య కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతి అయిన అనూషకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆమె భర్తను, చనిపోవడానికి కారణమైన ఓ ప్రైవేట్ హాస్పిటల్ వైద్యురాలిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

యోగాంధ్రపై నేడు నగరంలో ర్యాలీ

నెహ్రూనగర్: యోగాంధ్ర– 2025 కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం నుంచి లక్ష్మీపురం మదర్ థెరిస్సా విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే వార్డ్ సచివాలయాల వారీగా యోగాంధ్ర వెబ్ సైట్‌లో యోగాపై ఆసక్తి కలిగి, దేశ ప్రధాని పాల్గొనే వైజాగ్‌లో జరిగే సదస్సుకు వెళ్లాలనుకునే వారి రిజిస్ట్రేషన్ చేస్తున్నామని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: మద్యం తాగవద్దని భార్య, తల్లి మందలించడంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జానినిత్యంజయనగర్‌కు చెందిన ఎం.సాయికుమార్ (24) నిత్యం మద్యం తాగి భార్యతో గొడవ పడుతుంటాడు. ఈ క్రమంలో ఈనెల 26న కూడా తాగొచ్చి ఆమెతో గొడవపడ్డాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్‌కు ఉన్న ఇనుప రాడ్‌కు బెడ్‌షీట్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పల్లెనిద్రతో పోలీసుల భరోసా



పట్నంబజారు: ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట, లాలాపేట, పాత గుంటూరు పోలీసు స్టేషన్ల పరిధిలో సోమవారం పల్లెనిద్ర కార్యక్రమాన్ని ఆయా స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓల ఆధ్వర్యంలో నిర్వహించారు. కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో జరిగిన పల్లెనిద్ర కార్యక్రమానికి డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం.వీరయ్యచౌదరి హాజరయ్యారు. స్థానికులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లాలాపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్ ఎల్‌ఆర్ కాలనీలో జరిగిన పల్లెనిద్రలో పాల్గొన్నారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆంజనేయస్వామి దేవస్థానంలో నిద్రించారు. పాత గుంటూరు పోలీసు స్టేషన్ పరిధిలోని యాదవ హైస్కూలులో పల్లె నిద్ర కార్యక్రమాన్ని ఎస్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్, ఎస్‌ఐలు నిర్వహించారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ



పట్నంబజారు : రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొట్టుకున్న సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరాలు ప్రకారం.. హిందూ కళాశాల కూడలిలో సోమవారం సాయంత్రం రెండు బస్సుల డ్రైవర్లు ఎత్తు రోడ్డు సెంటర్ వైపు నుంచి వస్తూ పోటీ పడ్డారు. ఈ ఘటనలో రెండు బస్సులు స్వల్పంగా ఢీకొట్టుకున్నాయి. ప్రయాణికులకు ప్రమాదం జరగలేదు. డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనం నడపడంపై పలువురు మండిపడ్డారు.

రూ.41కోట్లతో పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

నెహ్రూనగర్: నగరంలో రూ.41 కోట్లతో పలు డివిజన్లలో అభివృద్ధి పనులు చేసేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపిందని చైర్మన్, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. సోమవారం స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని మేయర్ చాంబర్‌లో నిర్వహించారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి మేయర్ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదించిన 117 అంశాలకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వార్డుల్లో జరిగే అభివృద్ధి పనులు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ప్రకారం కార్పొరేటర్లకు ముందస్తు సమాచారం అందించి ఆహ్వానించాలని సూచించారు. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నామని, విలీన గ్రామాల్లో కూడా నూతనంగా సీసీ డ్రైన్లు, రోడ్ల ఏర్పాటుకు ప్రత్యేక ఆమోదం తెలిపామని పేర్కొన్నారు. సమావేశంలో స్థాయి సంఘ సభ్యులు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, కొమ్మినేని కోటేశ్వరరావు, నూకవరపు బాలాజీ, దాసరి లక్ష్మీదుర్గ, ముప్పవరపు భారతి, నగర పాలక సంస్థ వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.



సమావేశంలో అంశాలను చర్చిస్తున్న మేయర్ రవీంద్ర, కమిటీ సభ్యులు

పారిశుద్ధ్య సమస్యలకు 48 గంటల్లోగా పరిష్కారం

క్లీన్ అండ్ గ్రీన్ గుంటూరులో వార్డుల వారీగా చేపట్టిన పారిశుద్ధ్య సమస్యలను 48 గంటల్లోగా పరిష్కరించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం 21వ వార్డ్‌లోని భాను ప్రసాద్ కాలనీ, శశాంక్ గోయల్ కాలనీ, కేవీపీ కాలనీ మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల్లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి మెగా క్లీన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కేవీపీ కాలనీ మెయిన్ రోడ్డులో ఆక్రమణలను రెండు రోజుల్లో తొలగించాలని ఆదేశించారు. డ్రైయిన్లలో తీసిన పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పారు. భానుప్రసాద్ కాలనీలో తాగునీటి కాలుష్యంపై మాట్లాడుతూ సరఫరా సమయంలోనే ప్రజలు నీటిని పట్టుకోవాలని, ఇతర సమయాల్లో మోటార్ల ద్వారా పంప్ చేయకూడదని సూచించారు. తాగునీటి సరఫరా సమయంలో శ్యాంపిల్స్ తీసి, ఎక్కడైనా లీకులు ఉంటే తక్షణ చర్యలు తీసుకోవాలని డీఈఈని ఆదేశించారు. కార్యక్రమంలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డెప్యూటీ సిటీప్లానర్ సూరజ్ కుమార్, డీఈఈ మధుసూదన్, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, బయాలజిస్ట్ రామారావు, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, కంద్రగుంట గురవయ్య, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సూపర్‌వైజర్లు ఉండటానికి వీల్లేదు

ప్రజారోగ్య విభాగ కార్మికులు సూపర్‌వైజర్లుగా ఇతర విధుల్లో ఉండడానికి వీల్లేదని, వారికి కేటాయించిన పనుల్లోనే నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం ఆయన జీటీ రోడ్, కేవీపీ కాలనీ రోడ్డులోని పలు ప్రాంతాలల్లో పర్యటించారు. ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలలో సూపర్‌వైజర్లను గుర్తిస్తే సంబంధిత ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇళ్ల దగ్గర నుంచి నూరు శాతం వ్యర్థాలు సేకరిస్తే రోడ్ల మీద చెత్త పడదని, క్షేత్రస్థాయి సిబ్బంది అలసత్వం వల్ల మెరుగైన పారిశుద్ధ్య పనులు జరగడం లేదని తెలిపారు. కార్యక్రమంలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డీఈఈ మధుసూదన్, బయాలజిస్ట్ రామారావు, ఎస్‌ఎస్ రాజేష్, సచివాలయ ఏఈ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సూర్యకుమార్ ప్రజ్ఞ, మేధాశక్తి ప్రశంసనీయం

మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతమైన డిగ్రీలు లేకపోయినప్పటికీ రెండుసార్లు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన పూసపాటి కృష్ణ సూర్యకుమార్ మేధాశక్తి, ప్రజ్ఞా పాటవాలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. 70 ఏళ్ల వయసులో వాట్సాప్ మాధ్యమం ద్వారా తన అర్థమెటిక్ ఫార్ములాతో ఎమ్మెస్ ఎక్సెల్ షీట్ ద్వారా 10,48,574 గడులలో అంతే సంఖ్యలో కేవలం ఒక్క గంటలో జవాబులు రాయడం ప్రశంసనీయమని తెలిపారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన కృష్ణ సూర్యకుమార్‌ను సోమవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో అభినందించారు. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ వాట్సాప్ ద్వారా తెలుగు పద్య రచనపై వందలాది మంది తెలుగు ఉపాధ్యాయులకు శిక్షణ అందించిన కృష్ణ సూర్యకుమార్ ప్రతిభ అద్భుతమన్నారు. ఆయన త్వరలో గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సైతం స్థానం సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత కృష్ణ కుమార్ మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రత్యేక శ్రద్ధతో తాను చేసిన ప్రయోగం, కృషికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ పూర్తిస్థాయిలో సంతృప్తి చెంది, తనకు ప్రత్యేకంగా గుర్తింపు అందించారని చెప్పారు. వెయ్యి మంది ఉపాధ్యాయులకు పద్య రచనపై శిక్షణ అందించానని తెలిపారు. కార్యక్రమంలో పూసపాటి నాగమణి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్, వెలగా వినోద్, వాసుదేవశర్మ, రాధాకృష్ణమూర్తి, ఓంకార్స్ రాము, ఏక వెంకటరామయ్య, దామరాజు రవి పాల్గొన్నారు.



సూర్యకుమార్ దంపతులను సత్కరిస్తున్న లక్ష్మణరావు, యూటీఎఫ్ ప్రతినిధులు

ప్రజల అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు

నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్‌ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలు, ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్ ఆదేశించారు. కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్‌ఎస్‌లో నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 12 ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లాలని, పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం జరిగిన పీజీఆర్‌ఎస్ ద్వారా 30 ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి– 11, ఇంజినీరింగ్ విభాగానికి– 9, రెవెన్యూ విభాగానికి –3, ప్రజారోగ్య విభాగానికి –3, ఉపా సెల్ విభాగానికి– 1, అకౌంట్స్ విభాగానికి –3 ఫిర్యాదులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, ఈఈ సుందర్రామిరెడ్డి, బయాలజిస్ట్ రామారావు, మేనేజర్ బాలాజీ బాషా, విభాగాల సూపరింటెండెంట్లు, ఎస్‌ఎస్‌లు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డెప్యూటీ కమిషనర్లు

క్రైస్తవ సమాధి తోటలకు స్థలాలు కేటాయించాలి

నెహ్రూనగర్: నగరంలోని క్రైస్తవ సమాధుల తోటలు నిండిపోయాయని, స్థలాలు లేక క్రైస్తవులు ఇబ్బందులు పడుతున్నారని సామాజికవేత్త డాక్టర్ గోళ్ల మూడి రాజసుందరబాబు విన్నవించారు. ఆయన సోమవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసును కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి నగరం నాలుగు మూలల్లో సమాధి తోటలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై మైనార్టీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిని ఈ నెల 6న కలసి వినతి పత్రం అందజేశామన్నారు. ఆయన నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు ఈ నెల 21న ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కలెక్టర్ 24న నగరపాలక సంస్థ కమిషనర్‌కు లేఖ రాసిన నేపథ్యంలో దాన్ని ఆయనకు అందజేసినట్లు వివరించారు త్వరితగతిన సర్వే జరిపి క్రైస్తవ సమాధి తోటల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు మద్దు ప్రేమ జ్యోతిబాబు, ఎస్. శరత్‌బాబు, బడుగు రత్నకుమార్, చింతాబత్తిని బాబురావు, ఆగనాటి ఆంథోని, గద్దం సురేష్ పాల్గొన్నారు.



నగర కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రాజసుందరబాబు

కుట్ర పూరిత చర్యలను ఐక్యంగా ఎదుర్కొందాం

లక్ష్మీపురం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగిస్తామని మాయమాటలు చెబుతూ ప్రైవేటీకరణ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్‌కుమార్ అధ్యక్షతన పెద్దఎత్తున సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ 4,000 మంది కాంట్రాక్టర్ కార్మికులను విధుల నుంచి తొలగించి, మరో 2,500 మందిని తొలగించడానికి ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. 1,200 మంది పర్మనెంట్ కార్మికులను బలవంతంగా వీఆర్‌ఎస్ తీసుకునే విధంగా ఒత్తిడి తీసుకు వస్తున్నాయని తెలిపారు. మోసపూరిత చర్యలను తక్షణమే ఆపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

పల్లెనిద్రలో వెస్ట్ డీఎస్పీ అరవింద్

లక్ష్మీపురం: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ హెచ్చరించారు. గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ అరండల్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలోని శరదా కాలనీలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ అరవింద్ మాట్లాడుతూ గంజాయి లాంటి మత్తు పదార్థాలు తాగినా, క్రయవిక్రయాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బహిరంగంగా మద్యపానం చేసి స్థానికులకు ఇబ్బందులు పెడితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అరండల్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లపై నిఘా ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. బెదిరింపులు, రౌడీ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం తెలియజేయాలని స్థానికులను కోరారు.కార్యక్రమంలో సీఐ ఆరోగ్యరాజు, ఎస్ఐ కృష్ణబాజీ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ అరవింద్

గుండెపోటు భయంతో యువకుడి ఆత్మహత్య

లక్ష్మీపురం: గుండెపోటు వస్తుందనే భయంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంజీవయ్యనగర్‌కు చెందిన గరికపాటి శివరామకృష్ణ (36) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 24న గుండెపోటు వస్తుందనే భయంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చలపతి ఫార్మసీ కళాశాలలో జాబ్ మేళా

ప్రత్తిపాడు: గుంటూరు రూరల్ మండలం లాం చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో సోమవారం ఫార్మసీ కంపెనీలు మెగా జాబ్ మేళాను నిర్వహించాయి. జాబ్ మేళాకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి బీఫార్మసీ, ఎంఫార్మసీ, బీఎస్‌సీ, ఎంఎస్‌సీ, డిప్లొమా, ఐటీఐతో పాటు డిగ్రీ విద్యార్హత కలిగిన 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి నాట్కో, హెటిరో, అరబిందో కంపెనీలు తొలుత రాత పరీక్ష నిర్వహించాయి. ఉత్తీర్ణులైన వారికి టెక్నికల్, హెచ్ఆర్ రౌండ్‌లు నిర్వహించాయి. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన 15 మంది విద్యార్థులను నాట్కో ఫార్మా కంపెనీ, 30 మందిని హెటిరో ఫార్మా కంపెనీ, 20 మందిని ఎస్ఎస్ఎస్‌వీ ఫర్ అరబిందో కంపెనీ ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు తెలిపారు. కార్యక్రమంలో నాట్కో ఫార్మా కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ రంజిత్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ యు.సుమంత్, డిప్యూటీ అసిస్టెంట్ మేనేజర్ కె.గోపికృష్ణ, హెటిరో ఫార్మా కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ కె.సమీర్‌కుమార్, చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com